క్లుప్తంగా

పాఠశాలకు బ్లూటూత్ స్పీకర్ బహూకరణ



బాలెమర్రు(క్రోసూరు): బాలెమర్రు పాఠశాలకు పూర్వ విద్యార్థి, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.శారద రూ.15వేలు విలువ చేసే బ్లూటూత్ స్పీకర్‌ను ఆదివారం బహూకరించారు. గ్రామంలోని ఎంపీపీ(ఎన్‌డబ్ల్యూటీ) పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పాఠశాల హెచ్‌ఎం శరత్ కోరిక మేరకు బ్లూటూత్ స్పీకర్ అందజేయటం జరిగిందన్నారు. మధుసూదనరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వరరావు, స్కూల్ చైర్మన్ పెద్ద శేషగిరిరావు, ఉపాధ్యాయులు బోళ్ల నరసింహారెడ్డి, పిచ్చయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు బీఎల్వోలు, సూపర్‌వైజర్లకు సమావేశం

సత్తెనపల్లి: పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 గంటలకు సత్తెనపల్లి పట్టణంలోని బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు సమావేశం జరుగుతుందని తహసీల్దారు ఎస్.సురేష్ ఆదివారం తెలిపారు. ఈ సమావేశంలో సత్తెనపల్లి ఆర్డీవో రాజకుమారి పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. బీఎల్వోలు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం జరుగుతుందన్నారు.

టీకాలు వేయించుకోవాలి

రాజుపాలెం: మండలం కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం నుంచి 12వ తేదీ వరకు గర్భిణులకు, ఐదేళ్ల లోపు చిన్నారులకు టీకాలు వేయనున్నట్లు డాక్టర్ కృష్ణకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 29 మంది పిల్లలు టీకాలు వేయించుకోలేదని తెలిపారు. వారందరికి గ్రామం సచివాలయ పరిధిలోని అన్ని విలేజ్ హెల్త్ క్లీనిక్‌లో టీకాలు వేయనున్నట్లు వైద్యులు తెలిపారు.

సాగరమాత దేవాలయంలో భక్తుల సందడి



విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సాగర్‌మాత పుణ్యక్షేత్రానికి తరలి వచ్చారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తులు మొక్కుబడులు జరుగుతున్నాయి. ఉదయం భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలిపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షిణ నిర్వహించారు. ఆ తరువాత జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాత ప్లాస్టిక్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం

నరసరావుపేట: స్థానిక రావిపాడురోడ్డులోని పాలూరి వెంకటరెడ్డికి చెందిన జయవెంకట సత్యసాయి పాత ప్లాస్టిక్ గోడౌన్‌లో ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వెంటనే అగ్నిమాపక సిబ్బంది స్పందించి మంటలు ఆర్పేయటంతో పెద్దనష్టం తప్పింది. సమీపంలోని పొలాల వారు తమ పొలాల్లోని ఎండుగడ్డికి పెట్టిన నిప్పు కారణంగా పాత గోడౌన్‌లోని సరుకుకు అంటుకొని మంటలు చెలరేగాయి. అగ్నిమాపక అధికారి ఎంవీ సుబ్బారావు నేతృత్వంలో సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.10వేల నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బంది వెల్లడించారు.

నిత్యావసరాల పంపిణీ

చిలకలూరిపేటటౌన్: పేద మహిళలను ఆదుకోవాలని స్వచ్ఛంద సేవా సంస్థ అసిస్ట్ డైరెక్టర్ జాష్టి రంగారావు చెప్పారు. అసిస్ట్, సీడ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని సుభానినగర్‌లో 300 మంది నిరుపేద ఒంటరి మహిళలకు రూ. 6లక్షల విలువైన నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి తమ సంస్థ దోహదపడుతుందన్నారు. సంస్థ సభ్యులు అస్మా, కమాల్, అబ్దుల్లా, జాష్టి కృష్ణహరీష్, మూర్తి, విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మరణం తీరనిలోటు

అమరావతి: విప్లవ సాహితీ లోకానికి, కళాకారులకి ప్రజా ఉద్యమ స్ఫూర్తికి ప్రజా గాయకుడు గద్దర్ మరణం తీరని లోటు అని సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తన ఆటపాటతో సమస్యలను ప్రజల దష్టికి.. తద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమాజంలో మార్పు కోసం తన జీవితాంతం కళాకారుడిగా, గాయకుడిగా అనేక కష్టాలు ఎదుర్కొన్న ప్రజల మనిషి గద్దర్ అన్నారు. కామ్రేడ్ గద్దర్ మృతికి అమరావతి సీపీఎం తరుపున సంతాపం తెలిపారు.

దొడ్లేరులో రూ.35.74 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

దొడ్లేరు(క్రోసూరు): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో దొడ్లేరు గ్రామ సచివాలయం -2 పరిధిలో సంక్షేమ పథకాలకు, అభివృద్ధి పనులకు రూ.35.74 కోట్లు ఖర్చుచేయటం జరిగిందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. ఆదివారం రెండవ రోజు దొడ్లేరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. రూ.24.74 కోట్లు సంక్షేమ సాయం అందించి, రూ.12 కోట్లు అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. వీటితో పాటుగా 220 మందికి జగనన్న ఇళ్ల పట్టాలు, రూ.13 లక్షల మండల పరిషత్ నిధులతో గ్రావెల్ రోడ్డు, రూ.10 లక్షలతో ఎస్టీ కాలనీలో సీసీరోడ్లు, రూ.80 లక్షలతో ఎస్సీ కాలనీలో సీసీరోడ్లు, డ్రెయిన్లు, రూ.45 లక్షలతో ముస్లిం, బీసీ ,ఎస్సీ కమ్యూనిటీ హాళ్లు, రూ.2.54 కోట్లతో జలజీవన్ మిషన్ పథకానికి నిధులు అందజేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముక్కుఅంజలి, వైఎస్సార్‌సీపీ నాయకులు సయ్యద్ అబ్దుల్ రహీం, అవుల అంకిరెడ్డి, ఆవుల నరసింహారెడ్డి, సోము మస్తాన్‌రెడ్డి, ఎంపీటీసీ నాగయ్య, ఖాజా, సయ్యద్ సైదా, మర్రి శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ జమీలాగపూర్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వెలది అప్పారావు, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ బస్సు యాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మారుతీ వరప్రసాద్

అమరావతి: సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు మోదీ హటావ్ దేశ్ బచావో నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్ కోరారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పెదకూరపాడు నియోజవర్గ సమితి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల కార్యదర్శి కారంపూడి చెన్నకేశవరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ మణిపూర్ లో మారణహోమంపై కేంద్ర ప్రభుత్వం వైఖరి దారుణంగా ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజల ప్రయోజనాలను కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టి, దేశంలో ఉన్న సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. ప్రధాని మోదీ పాలక విధానాన్ని ఎండగట్టేందుకు మోదీ హటావ్ దేశ్ బచావో అనే నినాదంతో బస్సు యాత్ర తలపెట్టినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పల్నాడు జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, నియోజకవర్గ కార్యదర్శి మునుగోడు శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి భైరాపట్నం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ సేవలు అభినందనీయం

సత్తెనపల్లి: వలంటీర్, సచివాలయ, రైతు భరోసా కేంద్రాల సేవలు అభినందనీయమని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అన్నారు. బట్లూరు గ్రామానికి చెందిన వలంటీర్ బట్లూరు బాబురావు సొంత వివిధ ప్రాంతాల్లో ఉన్న వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ పంపిణీ చేయడం అభినందనీయమని ఆదివారం ప్రత్యేకంగా కొనియాడారు. ప్రభుత్వం అందిస్తున్న వలంటీర్, సచివాలయ, రైతు భరోసా కేంద్రాల సేవలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

దొడ్లేరు(క్రోసూరు): రాష్ట్ర ప్రభుత్వం యువతకు చదువుకు తగ్గ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ ఆదివారం డిమాండ్ చేసింది. దొడ్లేరు గ్రామంలో ఏర్పాటు చేసిన డీవైఎఫ్ఐ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు టి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ యువతకు ప్రాధాన్యత కలిగిన ఉద్యోగాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ వెలువరించాలని, పాఠశాలల్లో ఉపాధ్యాయపోస్టుల ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా దొడ్లేరు గ్రామ డీవైఎఫ్ఐ కమిటీ ఎంపిక చేసినట్లు తెలిపారు. అధ్యక్షుడిగా కోటేశ్వరరావు, కార్యదర్శి మనోజ్‌శాస్త్రి నియమితులైనట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గోపికుమార్, పలువురు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు అరికట్టడంలో విఫలం



మాట్లాడుతున్న రవిబాబు

సత్తెనపల్లి: దేశంలో దళితుల మీద జరుగుతున్న దాడులను అరికట్టడంలో పాలకులు విఫలమయ్యారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్)పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు ఆరోపించారు. కేవీపీఎస్ పల్నాడు జిల్లా కమిటీ సమావేశం సంఘ నేత చింతపల్లి నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన సత్తెనపల్లిలోని పీవీ భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ చుండూరు దళితుల ఊచకోత దగ్గర నుంచి, నేడు పిడుగురాళ్ల గుత్తికొండలో సజీవ దహనం అయిన దార్ల సాంబశివరావు వరకు చూస్తే పాలకులకు దళితుల ఓట్ల మీద ఉన్న ప్రేమ దళితులకు రక్షణ కల్పించడంలో లేదని ఆయన విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ మనువాద నాయకత్వంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా దళితుల మీద దాడులు తీవ్రంగా పెరిగాయని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడానికి జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చేయటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేకుంటే దళితుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరిక చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు వై.రాధాకృష్ణ, పల్నాడు జిల్లా నాయకులు ఎం.విల్సన్, మేడం ఆంజనేయులు, ఎం.క్రీస్తు రాజు, బొల్లెపల్లి రామారావు, వంకాయలపాటి పద్మ, సుమ, ఇనుముక్కల ఏసు కుమార్, బంక చిన్న వెంకటస్వామి, కె.ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి..

ముప్పాళ్ల: ఖరీఫ్ సీజన్ ఆరంభమైంది. మెట్ట పంటలు పత్తి సాగు చేపట్టగా, మిరప నారుమడులను రైతులు సిద్ధం చేస్తున్నారు. మాగాణిలో జనుము, జీలుగ, మినుము వేశారు. నాగార్జునసాగర్ ఆయకట్టుకు నీరు విడుదల చేస్తారనే ఆశతో దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. నీటి విడుదల లేకుంటే ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజొన్న, సోయ పంటలు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. పంటలలో ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఎం.అరుణ ఈ సందర్భంగా సూచిస్తున్నారు. నత్రజని ఎరువు దఫాల వారీగా వేసుకోవాలన్నారు. భాస్వరం ఎరువులను జింక్ సల్ఫేట్‌తో కలిపి వాడరాదని సూచించారు. భూసార పరీక్షలు ఆధారంగానే ఎరువులు వాడాలని స్పష్టం చేశారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

ముప్పాళ్ల: దమ్మాలపాడు గ్రామంలోని పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి, ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్సై కిశోర్ ఆదివారం తెలిపారు. గ్రామ సమీపంలోని పొలాల్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో సిబ్బందితో దాడి చేసినట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.1,250లు నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

ఇంతకంటే సంతోషం ఉంటుందా

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



ఎమ్మెల్యే శంకరరావును సత్కరించిన అసోసియేషన్ సభ్యులు

క్రోసూరు: వ్యాపారంలో వంద కోట్ల రూపాయలు సంపాదించిన దానికంటే తన వల్ల ఒక ప్రాణం నిలబడితే ఎక్కువగా సంతోషిస్తానని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. క్రోసూరుకు చెందిన బాలుడు షేక్ అష్రాఫ్ లివర్ వ్యాధితో బాధపడుతుండగా చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.20లక్షలను ఎమ్మెల్యే మంజూరు చేయించారు. దీంతో స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను శంకరరావును సత్తెనపల్లి టూవీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపి, సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలుడు అష్రాఫ్ సమస్య తెలుసుకున్న తాను ఎంతో చలించిపోయానన్నారు. ఈ నెల 11న బాలుడి ఆపరేషన్ విజయంతంగా జరగాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. సత్తెనపల్లి టూవీలర్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ మెకానిక్ షేక్ చిన్న సైదా కుటుంబాన్ని ఆదుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వెలది అప్పారావు, జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్, అడితి ముస్తఫా పాల్గొన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

నకరికల్లు: పీఎం కిసాన్ యోజన పథకానికి అర్హత సాధించేందుకు రైతులు ఈ-కేవైసీ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు ఆదివారం తెలిపారు. ఆర్బీకేల్లో రైతు భరోసాకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈకేవైసీ తప్పనిసరి అన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

వినుకొండ(నూజెండ్ల): ఈ నెల 31వ తేదీ మహాపౌర్ణమి సందర్భంగా సుప్రసిద్ధ అరుణాచలం స్వామి వారి దర్శనం, గిరిప్రదక్షిణకు వినుకొండ డిపో నుంచి ప్రత్యే సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు డీఎం కోటేశ్వరరావు నాయక్ తెలిపారు. ఆగస్టు 29వ తేదీ సాయంత్రం 9గంటలకు బయలుదేరి 30వ తేదీ ఉదయం శ్రీకాళహస్తి, మధ్యాహ్నం 12గంటలకు కాణిపాకం వినాయక దర్శనం, సాయంత్రం 6గంటలకు శ్రీపురం గోల్డెన్ టెంపుల్, ఆగస్టు 31వ తేదీ ఉదయం 5గంటలకు అరుణాచలం దర్శనం కొరకు చేరుకొని తిరిగి సెప్టెంబరు 1వ తేదీ ఉదయం 4గంటలకు వినుకొండకు చేరుతుందని తెలిపారు. టిక్కెట్ ధర ఒక్కొక్కరికి రూ.2,550లుగా నిర్ణయించామని, ముందస్తుగా రిజర్వేషన్ సదుపాయం ఉందని ఆ యన తెలిపారు. మరిన్ని వివరాలకు 738289552 7, 7382898320 నంబర్లను సంప్రదించాలన్నారు.

మానసిక దివ్యాంగులకు అండగా ఉండాలి



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న నేతలు

దాచేపల్లి : మానసిక దివ్యాంగులకు ప్రతి ఒక్కరు అండగా ఉండాలని వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ షభ్యుడు మందపాటి రమేష్‌రెడ్డి అన్నారు. నారాయణపురంలోని మానసిక దివ్యాంగుల విద్యా కేంద్రంలో చదువుతున్న విద్యార్థులకు మాజీ ఎంపీటీసీ పల్లపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నెల రోజులకు సరిపడే రూ.20 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఏడాదికి సరిపడే నిత్యావసర సరుకులను ప్రతి నెల ఇవ్వాలని నిర్ణయించుకున్నామని, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నాయకత్వంలో ప్రతి నెల నిత్యావసరుకులను అందిస్తునానమని రమేష్‌రెడ్డి చెప్పారు. మానసిక దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉందని, స్థానికులు కూడా ఈ కేంద్రంలో ఉన్న మానసిక దివ్యాంగుల కేంద్రంను సందర్శించి తొడ్పాటు అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కొమెర బత్తిన విజయ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ పల్లపు వెంకటేశ్వర్లు, ముగ్గు మిల్లు అసోసియేషన్ నాయకులు కొప్పుల గురవారెడ్డి, గొట్టం అంజిరెడ్డి, మందపాటి వెంకటరెడ్డి, పల్లపు బాలు, సిస్టర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నాదెండ్ల: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో తండ్రీకొడుకులు గాయాలపాలై చికిత్స పొందుతూ తండ్రి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గణపవరం గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు షేక్ మౌలాలి(71), మస్తాన్ ఈ నెల 2వ తేదీన గణపవరం గ్రామంలో పింఛను తీసుకొని ద్విచక్రవాహనంపై తిరిగి చిలకలూరిపేట వెళ్తున్నారు. జాతీయ రహదారిపై మలుపు తిరుగుతుండగా మంగళగిరి నుంచి నంద్యాల వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో తండ్రి మౌలాలి తీవ్ర గాయాలపాలు కాగా, కుమారుడు మస్తాన్‌కి స్వల్ప గాయాలయ్యాయి. అదేరోజు మౌలాలిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి ఒక కుమారుడు, ఇరువురు కుమార్తెలు కాగా, భార్య గతంలోనే మృతి చెందింది.

నరసరావుపేట టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ అశోక్ కుమార్ ఆదివారం తెలిపారు. గత నెల 23వ తేదీన శ్రీనిధి హోటల్ సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడు రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న వనటౌన్ పోలీసులు అతన్ని ఏరియా వైద్యశాల్లో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు వివరాలు తెలిసిన వారు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నరసరావుపేట టౌన్: వ్యక్తి ఆత్మహత్యాయత్నంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు ఆదివారం తెలిపారు. బరంపేట జెండా చెట్టు వీధికి చెందిన సయ్యద్ జానీబాషా తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. సుమారు మూడు నెలల క్రితం భార్య పుట్టిల్లు అయిన తూబాడు గ్రామానికి వెళ్లి ద్విచక్రవాహనంపై వస్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. సంఘటనలో జానీబాషా తల భాగంలో తీవ్రగాయమైంది. అప్పటి నుంచి మతిస్థిమితం కోల్పోయినట్లుగా ప్రవర్తిస్తున్నాడు. శనివారం ఫ్యాన్‌కు దుప్పటితో ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన భార్య హుస్సేన్‌బీ కత్తితో దుప్పటిను కోసి రక్షించింది. జానీబాషా పరిస్థితి ఆందోళనకరంగా మారటంతో పల్నాడు రోడ్డులోని ఓ ప్రైవేటు వైద్యశాల్లో చేర్పించారు. బాధితుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు బాధితుడి భార్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన



కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు

అమరావతి: మండల పరిధిలోని మల్లాది గ్రామంలో రూ.15 లక్షల ఎంపీ నిధులతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆదివారం నరసరావుపేట ఎంపీ లావు శ్రీకష్ణదేవరాయులు, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. ఎస్సీ కాలనీలో సామాజిక అవసరాలకు, ప్రజలకు ఎక్కువగా ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాలు నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ డైరెక్టర్ కోట హరిబాబు, క్రోసూరు ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, మాజీ ఎంపీపీ వెంపా జ్వాలాలక్ష్మీనరసింహారావు, భవిరిశెట్టి హనుమంతరావు, నాయుడు రాంబాబు, మంగిశెట్టి కోటేశ్వరరావు, వాసు, నండూరు కరుణకుమార్, ఎంపీడీఓ ఉమాదేవి పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజీ నిర్మాణ పనులు పరిశీలన

మండలంలోని 14వ మైలు- ఉంగుటూరు మధ్య నరుకుళ్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న కోల్డ్ స్టోరేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే శంకరరావు ఆదివారం పరిశీలించారు. నాబార్డు నిధులు, గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సహకారంతో 95 వేల బస్తాల నిల్వ సామర్థ్యంతో..రూ.9.75 కోట్లతో నిర్మిస్తున్న కోల్డ్ స్టోరేజీని త్వరితగతిన పూర్తి చేసి, వచ్చే వేసవికి సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సంబంధిత సిబ్బందికి సూచించారు.

స్వచ్ఛంద సంస్థల సేవలను పేదలు వినియోగించుకోవాలి



రెంటపాళ్లలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న గ్రామ ప్రజలు

సత్తెనపల్లి: హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెంటపాళ్ల గ్రామంలోని లూథరన్ దేవాలయంలో ఆదివారం ఉచిత కంటి, దంత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్యారిస్ పాస్టర్ ఎం.వినోద్ మిశ్రా ప్రారంభించి, మాట్లాడారు. హెల్ప్ ఫౌండేషన్ గ్రామీణ ప్రాంతాలలో పేదలకు అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి వైద్యులు డాక్టర్ వాసుదేవరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కళ్ల కలక పట్ల జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. వైద్యులు రాజేష్ మాట్లాడుతూ నేటి పరిస్థితులలో ప్రతి ఒక్కరూ కంటికి సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సత్తెనపల్లికి చెందిన బాల ఆదిత్య డెంటల్ మల్టీ స్పెషాలిటీ దంత వైద్యులు బాజీబాబు మాట్లాడుతూ దంతాలను సరైన పద్ధతిలో శుభ్రపరచుకోకుంటే పళ్లు, చిగుళ్లకు బ్యాక్టీరియా చేరి హాని కలిగిస్తాయన్నారు. కంటి సమస్యలున్న180 మందిని, దంత సమస్యలున్న 60 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. 16 మందికి కంటి శుక్లాలు అవసరమని గుర్తించారు. ఈ శిబిరంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, ప్యారిస్ డెలిగేట్ కట్ట దైవదానం, సభ్యులు మల్లీశ్వరి, అంజలి, సురేష్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత లోపం వల్లనే సమస్యలు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్

సత్తెనపల్లి: పురోహితులు, అర్చకుల్లో ఐక్యత లోపించడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని బ్రాహ్మణ ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు డాక్టర్ గుండ్లపల్లి శ్రీధర్ అన్నారు. శ్రీ వేద గాయత్రి పురోహిత సంఘం ఆధ్వర్యంలో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల సంయుక్త పురోహిత ఆత్మీయ సదస్సు పట్టణంలోని మన్నెం రెసిడెన్సీలో ఆదివారం జరిగింది. ఈ సదస్సుకు సంఘ అధ్యక్షుడు కలవకొలను సీతారామశాస్త్రి అధ్యక్షత వహించారు. డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ పురోహితులు, అర్చకులు సమష్టిగా ఉండాలన్నారు. పురోహితులకు, అర్చకులకు గౌరవం పెరిగేలా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. సదస్సులో పలు పురోహిత సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్త మంచి కంటి వెంకటేశ్వరరావును సత్కరించారు. సంఘ నాయకులు వేదాంతం వెంకట హరినాథ్, అధ్యక్షుడు పెద్దింటి ఫణికృష్ణ, కోశాధికారి అంపిరాయని రాజశేఖర్ శర్మ, రాష్ట్ర నాయకులు కోనంకి మారుతి, సంఘ పూర్వాధ్యక్షుడు సాధువెంకట శివప్రసాద్ శర్మ, మైలవరపు సుబ్బారావు, అన్నవరపు మణికంఠ శర్మ, మోతే పురుషోత్తమ శర్మ, మద్దాలి అనిల్ కుమార్ శర్మ పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. ఆనంద వేడుక



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

25 ఏళ్ల అనంతరం కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సత్తెనపల్లి: ప్రతి ఒక్కరి జీవితంలో అందరికన్నా చెరగని ముద్ర వేసేది మిత్రులే. ముఖ్యంగా పాఠశాల స్థాయి స్నేహితుల పాత్ర మరువలేనిది. అలనాటి మధురస్మృతులను నెమరువేసుకుంటూ..25 ఏళ్ల తర్వాత కలిసిన విద్యార్థులు అపూర్వ సమ్మేళనం సత్తెనపల్లి మండలం బృగుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగింది. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో 1997–98 సంవత్సరంలో 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక జరిగింది. 80 మంది పూర్వ విద్యార్థులు ఒక్క చోట కలిసి ఆనందాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు మంచి కంటి వెంకటేశ్వరరావు, రత్నరాజు, ఈపూరి వెంకటేశ్వరరెడ్డి, కలవకొలను శివప్రసాద్ శర్మ, షేక్ మహబూబ్, భాను, మురళీకృష్ణ, జయమణి, ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగరాజు సుధాకర్‌ను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు బొజ్జా నరేష్, చందు వెంకట్రావు, బిట్రగుంట కృష్ణారావు, గంపల అంకమ్మరావు, పసుపులేటి బసవమ్మ, బొజ్జా అరుణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

వస్త్ర వ్యాపారి అదృశ్యం

నరసరావుపేట టౌన్: వస్త్రవ్యాపారి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ అశోక్‌కుమార్ ఆదివారం తెలిపారు. శ్రీరాంపురంకు చెందిన పాలిశెట్టి పవన్‌కుమార్ రైల్వే స్టేషన్‌రోడ్డులో స్టేటస్ రెడీమేడ్ దుకాణం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఇంటినుంచి వెళ్లిన పవన్ తిరిగి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం దక్కలేదు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటినుంచి వెళ్లిపోయి ఉంటాడని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. ఈ మేరకు పవన్‌కుమార్ భార్య సాయిభార్గవి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.